# స్త్రీవాదం-జయాపజయాలు

డా॥ ఎం.విజయశ్రీ
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు డిపార్టుమెంట్
జె.కె.సి.కళాశాల,గుంటూరు
ఫోన్-9704074386
ఇమెయిల్ : vijayasreem61@gmail.com

మనదేశంలో స్త్రీ చైతన్యం 18, 19 శతాబ్ధాలలో సంఘ సంస్కరణోద్యమాలతో ప్రారంభమైనది. రాజా రామమోహనరాయ్, కందుకూరి వీరేశలింగం, వెంకటరత్నం, ఉన్నవ వంటి వారు స్త్రీల అభ్యున్నతికి కృషి చేశారు. స్వాతంత్ర్యానంతరం స్త్రీల విద్య పెరిగింది. ఆ దశలోనే 1960-70 మధ్య రచయిత్రులెందరో తెలుగులో ఎదిగారు. సాహిత్య సృష్టి చేశారు. స్త్రీలలో ఆత్మగౌరవాన్ని నింపారు. వాసిరెడ్డి సీతాదేవి, ఆచంట శారదాదేవి, రంగనాయకమ్మ, లత వంటి రచయిత్రులెందరో తమ రచనలతో స్త్రీని చైతన్యపరిచారు.

1975-85 దశకం మహిళా దశాబ్దంగా పిలువబడింది. విమల రాసిన తెగిపడిన మా కలల ప్రపంచం, వంటిల్లు, సౌందర్యాత్మక హింస స్త్రీ గొంతును బలంగా వినిపించారు. 1986లో ఓల్గా "సహజ" 1987లో "స్వేచ్ఛ" నవలను వ్రాసి స్త్రీ వాదాన్ని సిద్ధాంతరూపంగా ప్రబోధించింది. "స్త్రీ వాదం" పేరుతో ఇక సిద్ధాంత రూపంగా తెలుగులో స్థిరపడింది. ఇతర దేశాల్లోని స్త్రీవాదుల వివిధ సమాలోచనలతో వచ్చిన సిద్ధాంతముల ఓల్గా పత్రికల్లో వ్యాసాల రూపంగా పరిచయం చేసింది. స్త్రీ వాద వ్యాప్తిలో ఆమె పాత్ర కీలకమైనది. సాహిత్య యుగ విభజనలో స్త్రీ వాద యుగం అంటే ఓల్గా యుగమనే చెప్పాలి.

స్త్రీ వాదంలో ఒకరు ఉదారంగా ఆలోచిస్తే మరొకరు రాడికల్ దృకథంతో ఆలోచించారు. ఒకరు మార్క్సిస్టు అయితే, మరొకరు సోషలిస్టులైతే మరికొందరు ప్రజాస్వామ్య దృక్పథంతో ఆలోచించారు. వీరు ఎక్కువగా పాశ్చాత్య స్త్రీవాదులు చెప్పిన భావజాల ప్రతిధ్వనులు వినిపించారు. ఆ పాశ్చాత్య భావజాల పునాదుల మీదే తెలుగులో స్త్రీ వాదం ఏర్పడింది. దేశీయత, ప్రాంతీయతను వినిపించలేదనిపిస్తుంది. భారతదేశంలో వ్యవసాయం ప్రధాన వృత్తి, స్త్రీల శ్రమ దోపిడి ఎక్కువగా ఉంటుంది. ఆ స్త్రీల కేకలు ఈ వాదంతో వినిపించవు. బహుజనులు జనాభాలో 80శాతం ఆక్రమించారు. దళితులు, ఇంకా మైనార్టీల గొంతు వినిపించదు. వారి సమస్యలు కన్పించవు. ఈ విధంగా పాశ్చాత్య ధోరణి ప్రభావం కన్పిస్తుంది.

రానురాను స్త్రీ వాదంలో కొన్ని మార్పులు వచ్చాయి. ఈ దశాబ్దం మొదటి దశకంలో దేశీయమైన స్త్రీల సమస్యలు, బహుజన స్త్రీల దళిత మైనార్టీ స్త్రీల కంఠ ధ్వనులు వినిపిస్తున్నాయి. స్త్రీ వాదంలో వివిధ అస్తిత్వాలకు సమాన ప్రతిపత్తి కల్పించే వేదిన ఏర్పడి స్త్రీ వాదంలో నూతన పార్శ్వాన్ని ఆవిష్కరిస్తున్నది. ఇంకా ఆ వైపు కృషి జరుగవలసి ఉంది.

దళిత, బి.సి. వర్గాల స్త్రీలతో పాటు మైనారిటీ వర్గమైన ముస్లిం స్త్రీలు పీడనకు గురి అవుతున్నారు. దళిత, బి.సి.ల స్త్రీల కవిత్వంలో పోలిస్తే ముస్లిం స్త్రీల కవిత్వం కొద్దిగా ముందంజలోనే ఉన్నది.

స్త్రీలను అన్ని విధాల అణచి వేసే రాజకీయాలను, పితృస్వామ్య వ్యవస్థను ఆ వ్యవస్థలో కుటుంబం, సమాజం, మతం విధించిన కట్టుబాట్లను, పురుషాహంకారాన్ని, పురుషాధిపత్యాన్ని, సూటిగానే తెలుగు సాహిత్యంలో స్త్రీవాదులు ప్రశ్నించారు. కసితో నిందించారు. కవిత్వంలో భావ తీవ్రత ఎక్కువవుతుందని భావించి, నవలల కన్నా కవిత్వాన్నే ఎక్కువగా ఎన్నుకున్నారు.

ఈ విధంగా పురుషుణ్ణి విరోధిగా, వర్గశత్రువుగా భావించారు. కుటుంబాలను నష్ట పరచుకున్న వారు ఉన్నారు. ఈ విధంగా స్త్రీ వాదం తప్పుదోవ పట్టింది. మరికొందరు ఇంకా విప్లవాత్మకంగా ఆలోచించారు. "లెస్బియనిజం"తో సమస్యలుండవు అని భావించారు. ఇటువంటి విపరీత ధోరణి చాలామంది "స్త్రీ వాదం" చాటే స్త్రీలకే విచిత్ర మనిపించింది.

ఆధునిక సమాజంలో ఆడపిల్లల పెంపకం, చదువు, ఉద్యోగాల విషయాల్లో చాలా మార్పులు వచ్చాయి. పరిమిత కుటుంబాలతో ఆర్థికంగా ఎదగడం ఆరంభమైంది. మగ పిల్లలతో సమానంగా ఆడపిల్లలకు చదువు ఉండాలనే చైతన్యం సమాజంలో పెరిగింది. అన్ని రంగాలలో స్త్రీలు ఉన్నత స్థితిలో వుంటున్నారు. ప్రపంచీకరణం నేపథ్యంలో వచ్చిన ఈ మార్పులు సాహిత్యంలో కన్పిస్తున్నాయి. స్త్రీలు తమ హక్కులను కాపాడుకుంటున్నారు.

అయితే ముఖ్యంగా మనదేశంలో మన సమాజానికి మన నేలకు పరిమితమైన గంభీరమైన సమస్యలను తీర్చడంలో, పట్టించుకోవడంతో విఫలమైందని చెప్పవచ్చును. వీటిలో వరకట్నం సమస్య ఒకటి. కొన్నిచోట్ల ఆస్తి హక్కులేదు. వీరి గురించి స్త్రీ వాదులు మాట్లాడినట్లు లేదు. మరో సమస్య భ్రూణహత్య. దీని అంతం చేయడానికి ప్రయత్నించాలి. కొన్ని ప్రాంతాల్లో ఇంకా బాల్య వివాహాలున్నాయి. వితంతు వివాహాలు చాలా తక్కువ. మన సమాజంలో మరో సమస్య స్త్రీలను వేశ్యా వృత్తిలోనికి దింపటం. ఆడపిల్లలను

అమ్ముకోవడం స్త్రీలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా దాడులు జరపడం. ఇవన్నీ కొత్త భావజాలంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే రచనలు రావాలి. స్త్రీ వాదం దేనికోసం పోరాటం చేసినా, ఫలితం కన్పించటం లేదు. పురుషులకు స్త్రీవాద దృక్పథంతో అవగాహ కల్పించాలి. పురుషులను దోషులుగా చేసి కవిత్వం రచిస్తే లాభం ఉండదు. బాల్యం నుండి మగపిల్లలను పెంచడంలో జాగ్రత్త తీసుకోవాలి. అప్పుడే స్త్రీల పట్ల చులకన భావం తగ్గుతుంది అని ప్రబోధించే కవిత్వం రావాలి.

స్త్రీవాద కవిత్వం నిరంతరంగా సాగడానికి సామాజిక వాతావారణం అనుకూలించాలి. ఈ కవిత్వం సంచలనాలతో ప్రారంభమైనా నిర్విరామంగా కొనసాగలేకపోయింది. మునుపటి చురుకు వేగం కన్పించవు.

స్త్రీ రాసిన రాస్తున్న కవిత్వమే స్త్రీవాద కవిత్వం అని అనడం తప్పు. ఇది స్త్రీవాద కవిత్వం స్త్రీజాతి కవిత్వం కాదు.

స్త్రీ వాద కవిత్వం ఆకాశంలా విస్తరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. కవయిత్రులు స్వేచ్ఛా గాలులు పీల్చడానికి సరైన మార్గ నిర్దేశనం చేయలేకపోయింది. అదే జరిగి ఉంటే దళిత, మైనారిటీ స్త్రీవాద కవిత్వం ఇప్పటికీ కొంత సాగుతుండేది.

ప్రస్తుతం వేడి తగ్గినా, వాడి తగ్గని స్త్రీవాద కవయిత్రుల నుండి విలువలూ ప్రమాణాలు తగ్గని సమసమాజ అభ్యుదయాన్ని కాంక్షించే కవిత్వం మరింతగా రావాలి. ఆధునిక స్త్రీ చరిత్ర ఎంత ఘనమైందో - ఎంతటి సంఘర్షణ నుండి జీవం పోసుకుందో భావితరాలకు తెలియవలసిన అవసరం ఎంతైనా వుంది.